## క్లుప్తంగా

### ఆర్ఎంసీలో ఉత్సాహంగా ఉగాది వేడుకలు..



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు

కాకినాడ క్రైం: రంగరాయ వైద్య విద్యార్థుల ఆధ్వర్యంలో ఆర్ఎంసీ ఆడిటోరియంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. అతిథులుగా ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం దంపతులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి పాల్గొన్న ఈ కార్యక్రమంలో మహానంది క్షేత్రం వేదపండితుడు చెండూరి రవిశంకర్ అవధాని వీడియో లైవ్‌లో పంచాంగ పఠనం చేశారు. సాంస్కృతిక కమిటీ సభ్యులుగా వ్యవహరించిన ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ బి.దేవీ మాధవి, హెచ్‌వోడీ డాక్టర్ కె.శైలజ ఆధ్వర్యంలో పలువురు వైద్య విద్యార్థులు ఉగాది కళారూపాలు, కవితాలాపన చేశారు. ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు సహా యూజీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

### వచ్చేనెల 24న ఆంధ్ర మాలమహానాడు వార్షికోత్సవం



మాలల మల్ల యుద్ధభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కొండబాబు, లింగం శివప్రసాద్

కరప: కాకినాడలో ఏప్రిల్ 24న నిర్వహించనున్న ఆంధ్ర మాల మహానాడు ఏడో వార్షికోత్సవ సభను మాలలందరూ విజయవంతం చేయాలని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్దాంతుల కొండబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ పిలుపునిచ్చారు. కరపలోని నక్కావారి ఎస్సీ వీధిలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆంధ్రమాలమహానాడు, మాలల మల్లయుద్ధ పేరిట ముంద్రించిన పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. జీఓ 1976 రద్దు చేయాలని, దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని తదితర డిమాండ్లతో మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించే వార్షికోత్సవ బహిరంగసభకు అన్ని ప్రాంతాల్లోని మాలలందరూ తరలిరావాలన్నారు. గుబ్బల ఆదినారాయణ, వింత సురేష్, దండంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నీటిని పొదుపుగా వాడదాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగి సుబ్బారావు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ తాగునీటిని పొదుపుగా వాడాలన్నారు. పెరుగుతున్న జనాభాకు తోడు పారిశ్రామికీకరణ, అడవుల నరికివేత, వాతావరణ మార్పులతో నీటి ఎద్దడి తలెత్తుతోందన్నారు. అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, తదితరులు పాల్గొన్నారు.

### కోడి పందేలపై దాడి

సామర్లకోట: మండల పరిధి జి.మేడపాడులో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ మేరకు తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని రూ.11,200, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సర్వం శోభాయమానం

- భక్తులతో ఆలయాలు కిటకిట
- బంగారు చీరలో బాలాత్రిపురాంబిక దర్శనం
- పంచాంగ పఠనాలు చేసిన పండితులు

బోట్‌క్లబ్: తెలుగు నూతన సంవత్సరం ఉగాది సందర్భంగా భక్తులు బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక దేవాలయవీధిలోని బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు పొందూరు రామకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక టూటౌన్, మార్కెట్‌లోని నూకాలమ్మ తల్లిని భక్తులు దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లు సుమారు కిలో మీటరు మేర సాగింది. స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో పంచాంగ పఠనం చేశారు. నగరంలోని పలు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు దర్శనం కోసం పోటెత్తారు.

**కరప మండలంలో..**

కరప: మండల పరిధిలోని విష్ణు, శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో కరప విష్ణాలయంలో పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకష్ణ, సూర్యనారాయణ ప్రత్యేకపూజలు చేసి, పంచాంగ పఠనం చేశారు. ఈఓ వడ్డాది సత్తిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చినమామిడాడలోని పంచముఖేశ్వర ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామివార్లకు ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం పూజలు చేసి, పంచాంగ పఠనం చేశారు. నడకుదురు, గురజనాపల్లి, గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, వేళంగి, కూరాడ, వాకాడ, వేములవాడు, పెనుగుదురు తదితర గ్రామాల్లోని విష్ణు, శివాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.



గొడ్డటిపాలెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

**తెలుగు సంస్కృతికి పునాది ఉగాది**

కాకినాడ కల్చరల్: తెలుగు సంస్కృతికి ఉగాది పునాది వంటిదని సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దాడి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక శాస్త్రి కళాప్రాంగణం సమావేశ మందిరంలో వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. పీఎస్ఎన్‌పీ శాస్త్రి, డాక్టర్ గరికిపర్తి నమశ్శివాయ, సేవా విభాగంలోను, రాయపల్లి శ్రీనివాసరావుకు కళారంగంలోను ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. ఉగాది విశిష్టతపై కవి సమ్మేళనం నిర్వహించి అనంతరం కవులను సత్కరించారు. విద్యార్థులకు ఉగాదిపై ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కవులు దుర్గాప్రసాద్, అద్దేపల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వార్షిక ఫలాలు వివరిస్తున్న రామకృష్ణమ్మ సిద్ధాంతి



ప్రత్యేక అలంకరణలో కరపలో వేణుగోపాలుడు

**దేవుని అనుగ్రహంతోనే సర్వం సాధ్యం**

బోట్‌క్లబ్: దేవుని అనుగ్రహం లేనిదే ఏ కార్యక్రమం చేయలేమని ప్రఖ్యాత జ్యోతిష్య పండితుడు వక్కలంక రామకృష్ణమ్మ సిద్ధాంతి అన్నారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు నానాజీ పాల్గొన్నారు.

**వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం**

కరప: మండలంలోని గొడ్డటిపాలెం గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందురోజు రాత్రి తెల్లవార్లూ గరగ నృత్యాలు, గారడీలతో అమ్మవారికి జాతర నిర్వహించారు. సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు ఆలయకమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో కలసి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న వేదిక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్ తదితరులు



టూటౌన్ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

## అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి

**ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే ద్వారంపూడి**

కాకినాడ: శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అంది రాష్ట్రం ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆకాంక్షించారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక డి కన్వెన్షన్‌లో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ సాధించిన పది మందికి ఎమ్మెల్యే ద్వారంపూడి, మాజీ ఎమ్మెల్యే, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి సమక్షంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కోస్తా ఆంధ్ర రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ సత్తి వీర్రెడ్డి, రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ప్రముఖ న్యూరాలజిస్ట్ సాంబశివారెడ్డి, పారిశ్రామికవేత్త సత్తి సుబ్బారెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉగాది ప్రతిభాపురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘ ప్రతినిధులు హాజరయ్యారు.



ఉగాది ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే శేషారెడ్డి తదితరులు

# ప్రేమాభిమానాలను డబ్బుతో కొనలేం

- డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు

కాకినాడ: ప్రేమ, అభిమానం, స్నేహం వీటిని డబ్బుతో కొనలేమని, విలువ కట్టలేమని హెల్త్ అవేర్ అధ్యక్షులు, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ అంతర్జాతీయ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక గాంధీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో సుఖీభవ సభ్యులు శ్రీనివాస మాస్టర్ మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి సంస్థ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకన్న, కార్యదర్శి శేషగిరి ఆధ్వర్యంలో ప్రతినెల 500 మంది రోగులకు ఉచిత సేవలు అందిస్తూ సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్‌కు అండగా నిలుస్తున్న డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు సేవలు అమూల్యమైనవన్నారు. ట్రస్ట్ నాలుగో వార్షికోత్సవ పురస్కరించుకొని డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావును ట్రస్ట్ సభ్యులు భారీ యాపిల్ గజమాలతో సత్కరించి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ట్రస్ట్ సభ్యులు ధూళిపూడి ప్రభాకర్ బుల్లబ్బు ప్రసాద్, రజనీ చంద్రరావు హాస్పిటల్ సిబ్బంది నూకరాజు, మాధవి, లక్ష్మి, ధన, నాగమణి, హేమ, మోహన్, అలయన్స్ వైస్ గవర్నర్ అల్లై వసుం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి సత్కారం ఎంతో మందికి స్ఫూర్తినిస్తుందన్నారు.



డాక్టర్ వెంకటేశ్వరరావును యాపిల్ గజమాలతో సత్కరిస్తున్న సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

# కళాకారులకు తన వంతు సహకారం

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి

సామర్లకోట: కళాకారులకు తన వంతు సహకారం ఉంటుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సకల కళాసమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గతంలో సామర్లకోటలో రాష్ట్ర స్థాయి నాటిక పోటీలో నిర్వహించడానికి నాటక పరిషత్ ఉండేదని, తిరిగి నాటక పరిషత్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సకల కళా సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ రంగాలోని కళాకారులను ఒకే వేదిక మీదకు తీసుకురావడం అభినందనీయమన్నారు. పట్టణంలో ఎంతో మంది కళాకారులు ఉన్నారని వారిని వెలుగులోనికి తీసుకురావడానికి సమాఖ్య కృషి చేయాలన్నారు. పట్టణంలో కళావేదిక ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలను చైతన్యవంతులను చేసేలా ప్రదర్శనలు ఉండాలని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ మాట్లాడుతూ కళాకారుల వేదిక కోసం మున్సిపాలిటీలో స్థలం సేకరించి ఇచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీనియర్ కళాకారుడు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ యువత ముందుకు వచ్చి సకల కళా సమాఖ్య ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, గోకిన సునేత్రా దేవి, సకల కళాసమాఖ్య అధ్యక్షుడు బడుగు బాబీ, సినీ దర్శకుడు కేబీ ఆనంద్, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా కూచిపూడి, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలు నాటిక ప్రదర్శనల్లో విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు.

# అన్ని వర్గాలు సుభిక్షంగా ఉండాలి



ఉగాది వేడుకల్లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ప్రజలకు ఎమ్మెల్యే కురసాల ఉగాది శుభాకాంక్షలు
- రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో వేడుకలు
- పంచాంగ శ్రవణం చేసిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు

కాకినాడ రూరల్: శోభకృత్ నామ సంవత్సర ఉగాదిలో అన్ని వర్గాలకు మేలు జరగాలని, అందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆకాంక్షించారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక శిబిరంలో పూజల అనంతరం పంచాంగ కర్త గాడేపల్లి ప్రసాద్ పంచాంగం పఠనం చేసి రాశి ఫలాలు, ఆదాయ వ్యయాలు, రాజపూజ్య అవమానాలు వివరించారు. ఈ ఏడాది అన్నీ శుభాలే అని పంచాంగాలు చెప్తున్నాయని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శోభ అంటేనే కళ అని, సీఎం జగన్ పాలనలో సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ ఏడాది ప్రభుత్వ పాలనలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కానున్నాయన్నారు. నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకులు గోపుశెట్టి బాబ్జీ, రావూరి వెంకటేశ్వరరావు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సంగాడి మోషే, తదితరులు పాల్గొన్నారు.

**ఆలయాలలో పంచాంగ పఠనాలు..**

ఉగాది సందర్భంగా సర్పవరం భావనారాయణ స్వామి ఆలయంతో పాటు పలు ఆలయాలు, పలు గ్రామాల్లో పంచాంగ పఠనాలు జరిగాయి.

# ఘనంగా గంటాలమ్మ తీర్థం

కరప: స్థానిక పల్లపువీధి గ్రామ దేవత గంటాలమ్మ తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. వేద పండితుడు ముత్యం ప్రసాదరావు ఆధ్వర్యంలో కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం బృందం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి లక్ష పసుపుకొమ్ముల పూజ, హోమం నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు వుయ్యూరి రామచంద్రరావు, పెద్దాడి సత్తిరాజు, చీకల వెంకటరమణ తదితర ఆలయ కమిటీ సభ్యులు, సాయిమందిర్, షిరిడీయూత్ సభ్యులు, వీధిపెద్దలు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. పరిసర గ్రామాల భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



అమ్మవారికి పసుపుకొమ్ములతో పూజ చేస్తున్న అర్చకుడు

# కష్టాలు తీర్చే ప్రభుత్వమిది

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి
- కమ్యూనిటీ హాళ్ల ప్రారంభం

కాకినాడ: ప్రజలకు ఎలాంటి కష్టం ఉన్నా తీర్చగలిగే సమర్థత కలిగే ప్రభుత్వం అందుబాటులో ఉందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. అందువల్ల ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన పనిలేదని భరోసానిచ్చారు. స్థానిక 18వ డివిజన్‌లో రూ.28 లక్షలతో బడేసమ్మపేట, తూరంగిపేటలలో నిర్మించిన రెండు సామాజిక భవనాలను ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభించారు. డివిజన్‌లో ఆయన పర్యటించి పలు ప్రాంతాల్లో ప్రజల వద్దకు నేరుగా వెళ్ళి ప్రభుత్వ పరిపాలన ఎలా ఉంది? సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు. ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చిన స్థానిక సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, వీధి దీపాలు, ఇళ్ల పట్టాలు, పింఛన్లు సహా ఎటువంటి పథకమైనా అర్హత ఉంటే అందించడమే ప్రభుత్వ విధానమన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ కార్పొరేటర్లు చవ్వాకుల రాంబాబు, సంగాని నందం, వెలమల మల్లేశ్వరరావు, ధోని చిట్టిబాబు ఆయన వెంట ఉన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చంద్రకళాదీప్తి, శివప్రసన్న తదితరులు

# మానవత్వంతో దైవత్వాన్ని పొందవచ్చు

- డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం: మానవుడు తనలో ఉన్న మానవత్వాన్ని పెంచుకోవడం ద్వారా దైవత్వాన్ని పొందుతాడని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం పీఠం ఆవరణలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమర్ ఆలీషా భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. దుష్టత్వం ద్వారా రాక్షసత్వాన్ని మంచి పనుల ద్వారా మానవత్వాన్ని మానవుడు పొందుతాడని అందుచేత మానవత్వాన్ని పెంచుకునేలా మానవుడు నిరంతరం కృషి చేయాలని కోరారు. అంతరించిపోతున్న మానవత్వ విలువలు పెంపొందించుకోవాలంటే ముందుగా కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాల రూపంలో తనలో ఇమిడి ఉన్న అరిషడ్వర్గాలను అదుపుచేసుకోవాలన్నారు. అనంతరం వేసవిని దృష్టిలో ఉంచుకుని నూతన ఆశ్రమ ప్రధాన ద్వారం వద్ద చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పీఠంలో సేవలందిస్తున్న 45 మంది మహిళలను న్యాయమూర్తి సుధారాణితో కలిసి సత్కరించారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా పలువురు మహిళలకు కుట్టు మెషీన్లు, చీరలు అందజేశారు.



పేద మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న ఉమర్ ఆలీషా

# గట్టెక్కనున్న రహదారి సమస్య



ఆధునీకరించక ముందు కాలువగట్టు రహదారి పరిస్థితి



కూరాడ పొలాల వద్ద మెటల్, గ్రావెల్ వేసి ఆధునీకరిస్తున్న రహదారి

- రూ.80 లక్షలతో నిర్మాణం
- ఎమ్మెల్యే కురసాల చొరవకు ఇరు గ్రామాల ప్రజల హర్షం

కరప: మండలంలోని వాకాడ-కూరాడ రెండు మండలాలను అనుసంధానం చేసే కాలువగట్టు రహదారికి మోక్షం కలుగుతోంది. వాకాడ, కూరాడ గ్రామాల ప్రజలు అటూ, ఇటూ రాకపోకలు సాగించేందుకు, రైతులు పొలాలకు వెళ్లేందుకు, పంట ఉత్పత్తులు తెచ్చుకునేందుకు కాలువగట్టు దారే గతి. అలాగే వాకాడ గ్రామస్తులు కూరాడ వెళ్లాలన్నా, అటు పెదపూడి మండలం కాండ్రేగుల, సంపర, జి.మామిడాడ గ్రామాలకు వెళ్లాలన్నా కాలువగట్టు ద్వారానే వెళ్లాలి. గోతులతో అధ్వానంగా ఉన్న రహదారి వర్షాకాలంలో మరింత ప్రమాదకరంగా ఉంటుంది. ఈ కాలువగట్టు రహదారి అభివృద్ధికి కృషి చేయాలని కూరాడ మాజీ సర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్, వాకాడ సర్పంచ్ అడబాల సత్య, ఎంపీటీసీ సభ్యుడు చక్కపల్లి ఫకీర్రావు, అడబాల ప్రసాద్ ఎమ్మెల్యే కన్నబాబు విన్నవించారు. దీనికి ఆయన స్పందించి గతేడాది రూ.80 లక్షలు మంజూరు చేశారు. తదుపరి చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం జాప్యం చేసినప్పటికీ ఎమ్మెల్యే ఆదేశాలతో ఈ రహదారి పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి.


**చకచకా పనులు..**



సంపర బోదె కాలువగట్టు ద్వారానే కూరాడ, వాకాడ గ్రామస్తులు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి ఆధునీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో వారం రోజుల్లో ఈ రహదారి ప్రజలకు అందుబాటులోకి రానుంది.

– రావుల ప్రసాద్, మాజీసర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్, కూరాడ

**ఇబ్బందులు తీరుతాయి**



కాలువగట్టు వెంబడి తారు రోడ్డు వేస్తుండటంతో రెండు గ్రామాల ప్రజలు, రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఎమ్మెల్యే కన్నబాబు మేలును రెండు గ్రామాల వారు ఎప్పటికీ గుర్తించుకుంటారు.

– అడబాల ప్రసాద్, గ్రామస్తుడు, వాకాడ

# ఉత్తమ సేవలకు సత్కారం



కార్యక్రమంలో పాల్గొన్న ఏడీసీ నాగనరసింహారావు తదితరులు

కాకినాడ: 'పర్యావరణ పరిరక్షణ–ఆరోగ్య సంరక్షణ' అనే అంశంపై స్థానిక రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో బుధవారం సదస్సు నిర్వహించారు. జేఎన్‌టీయుకే వీసీ ప్రసాదరాజు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌ల నిషేధం, పెరటి–మిద్ది తోటల పెంపకం.. ఆవశ్యకత అనే అంశాలపై వక్తలు ప్రసంగించారు. ఆయా అంశాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. చైతన్యం ఆర్గనైజేషన్ ప్రతినిధి సత్యంమూర్తి, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్లు రాంబాబు, జిలానీ, సత్తెప్ప నాయుడు, లాజర్, రవివర్మతో పాటు మరో ఎనిమిది మంది శానిటరీ కార్యదర్శులు టెర్రస్ గార్డెనింగ్ కోసం కృషి చేస్తున్న మరో ఐదుగురిని ఎంపిక చేసి సభలో సత్కరించారు. రానున్న మూడు నెలల్లో ప్రతి ఇంటి మిద్దెపై పెరటితోటలు పెంపకం జరిగేలా ప్రోత్సహించాలని ప్రతిపాదించారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి అశోక్‌కుమార్, నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్, పలు సేవా సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



కళారత్న పురస్కారాన్ని స్వీకరిస్తున్న తురగా సూర్యారావు

**తురగాకు కళారత్న పురస్కారం**

కాకినాడ కల్చరల్: కాకినాడకు చెందిన తురగా సూర్యారావుకు కళారత్న పురస్కారం ప్రదానం చేశారు. విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ ఏటా ఉగాదిని పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశిష్టసేవలు అందజేసిన ప్రముఖులకు ఈ పురస్కారాలు ప్రదానం చేసి ప్రోత్సహిస్తోంది. విజయవాడలోని శ్రీకొత్తా పూర్ణానంద కళావేదిక సమావేశ మందిరంలో పురస్కారాల ప్రదానం బుధవారం జరిగింది. సంస్థ అధ్యక్షుడు బండారు నరసింహారావు కళారంగంలో తురగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం ప్రదానం చేశారు.



సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి నుంచి పురస్కారం అందుకుంటున్న ఆంజనేయరెడ్డి

**అనపాలకు ఉగాది పురస్కారం**

కాకినాడ రూరల్: కాకినాడకు చెందిన అనపాల ఆంజనేయరెడ్డిని ఉగాది పురస్కారం వరించింది. కాకినాడ-పిఠాపురం మార్గంలో రమణయ్యపేట భవాని కాస్టింగ్ సమీపంలో రోడ్డు పక్కన చిరు వ్యాపారం చేస్తుంటారు ఆయన. ఆయనకు వచ్చిన ఆదాయంతోనే సేవే పరమావధిగా పరోపకారం చేస్తుంటారు. తన సేవకు వివాహం అడ్డొస్తుందని ఆ విషయాన్నీ పక్కన పెట్టారు. ఏడాది పొడవునా చలివేంద్రం నిర్వహించే ఆయన సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఏపీ దృశ్య కళల అకాడమీ, కేంద్ర ప్రభుత్వ సంగీత, నాటక అకాడమీ, తదితర సంస్థ భాగస్వామ్యంతో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఇటీవల రాజమహేంద్రవరంలో ఉగాది పురస్కారాలు అందించగా, సినీ నటుడు ఆర్.నారాణమూర్తి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఆంజనేయరెడ్డి బుధవారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ వివిధ రంగాలలో వారికి అందించిన ఉగాది పురస్కారాలలో తాను భాగస్వామిని అయినందుకు ఆనందం వ్యక్తం చేశారు.